సాక్షి
ఏలూరు
బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



మరిదే చంపేశాడు

కొత్తరామయ్యపేటలో వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో మరిదే హత్య చేసినట్లు నిర్ధారించారు. 8లో ▸



మద్ది అంజన్నకు పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. స్వామి వారికి తమలపాకులతో పూజలు చేశారు.



కేంద్ర మంత్రిని కలిసిన కలెక్టర్

ఏలూరు (మెట్రో): ఏలూరు పర్యటనకు వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

1న నూర్‌బాషా దూదేకుల ఆత్మీయ సమావేశం

రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ



మాట్లాడుతున్న షేక్ సయ్యద్ బాజీ

ఏలూరు (టూటౌన్): తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం మార్చి ఒకటో తేదీన జరుగుతున్నట్లు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ చెప్పారు. స్థానిక నివాసంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లు వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న నూర్‌బాషా దూదేకుల రాజకీయ ప్రతినిధులు, నూర్‌భాషా సంఘ సభ్యులు, ముఖ్య నాయకులు తప్పకుండా హాజరుకావాల్సిందిగా బాజీ కోరారు.

టెట్‌కు 585 మంది హాజరు



ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో అంధుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) మంగళవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది. తొలిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 367 మందికి 291 మంది హాజరు కాగా, 76 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 367 మందికి 294 మంది హాజరు కాగా 73 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, ఏపీఆర్‌ఈఐ డైరెక్టర్ ఆర్.నరసింహారావు పరిశీలించారు.

‘పశ్చిమ’లో 90 శాతం హాజరు

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 90 శాతం మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణచెప్పారు. పరీక్షకు 200 మంది అభ్యర్థులకు గాను 181 మంది హాజరయ్యారన్నారు. ఏ విధమైన మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

3 నుంచి పీఏటీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో గుర్తించబడిన కేంద్రాల్లో మార్చి 3వ తేదీ నుంచి ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ (పీఏటీ) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్ టికెట్లు బీఎస్‌ఈ ఏపీ వెబ్‌సైట్‌లో పొందుపరచబడి ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను బుధవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

విజయోస్తు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఉమ్మడి జిల్లాలో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, స్క్వాడ్ ప్రతినిధులు, కస్టోడియన్లు తదితర అధికారులకు పరీక్షల నిర్వహణపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.



ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

ఏలూరు జిల్లాలో..	
మొత్తం విద్యార్థులు	32,445
ప్రథమ సంవత్సరం	15,656
ద్వితీయ సంవత్సరం	16,789
పరీక్షా కేంద్రాలు	51

పశ్చిమగోదావరి జిల్లాలో..	
మొత్తం విద్యార్థులు	35,949
ప్రథమ సంవత్సరం	17,806
ద్వితీయ సంవత్సరం	18,143
పరీక్షా కేంద్రాలు	52

- మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు
- పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిఘా
- నో సెల్‌ఫోన్ జోన్‌గా కేంద్రాలు

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాలో పరీక్షల నిర్వహణకు 51 కేంద్రాలను సిద్ధం చేశారు. వాటిలో 17 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలతో పాటు 30 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. ప్రతి పెరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి చొప్పున మొత్తం 51 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 51 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. వీరితో పాటు 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 21 మంది కస్టోడియన్లను సిద్ధం చేశారు. పరీక్షా పత్రాలు, పరీక్షకు సంబంధించిన గోప్యమైన వస్తువులు, పత్రాలను భద్రపరచడానికి 18 స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. అలాగే పరీక్షల్లో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు జరుగకుండా చూసేందుకు సుమారు 800 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పశ్చిమలో సర్వం సిద్ధం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆర్‌ఐవో కె.చంద్రశేఖర్‌బాబు మంగళవారం చెప్పారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 20వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 17,806 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 18,143 మంది రెండో సంవత్సరం విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు చంద్రశేఖర్‌బాబు వివరించారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

మార్చి 1 నుంచి ప్రారంభమై 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షకు, పరీక్షకు మధ్య ఒక రోజు విరామం వచ్చేలా షెడ్యూల్‌ను రూపొందించారు. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, రెండో రోజు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి.

పరీక్షకు హాజరయ్యే మొత్తం విద్యార్థులు 32445..

ఈ పరీక్షలకు జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 32445 మంది హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించడంతో విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, బోధనేతర సిబ్బంది, చీఫ్ సూపరింటెండెట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ఏవీ కలిగి ఉండరాదని అధికారులు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రాన్ని సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంచారు. అలాగే పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలుకు ఆదేశాలు ఇచ్చారు. పరీక్షా కేంద్రానికి సమీపంలో ఎటువంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు..

మార్చి 1న సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1, 4న ఇంగ్లిష్ పేపర్–1, 6న గణితం పేపర్–1ఏ, బోటనీ పేపర్ –1, సివిక్స్ పేపర్–1, 9న గణితం పేపర్–1బీ, జువాలజీ పేపర్–1, హిస్టరీ పేపర్–1 పరీక్షలు జరుగుతాయి. 12న ఫిజిక్స్ పేపర్–1, ఎకనామిక్స్ పేపర్–1, 14న కెమిస్ట్రి పేపర్–1, కామర్స్ పేపర్–1, సోషియాలజీ పేపర్–1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్–1, 16న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్–1, లాజిక్ పేపర్–1, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు గణితం పేపర్–1, 19వ తేదీన చివరి పరీక్షగా మోడరన్ లాంగ్వేజ్ పేపర్–1, జాగ్రఫీ పేపర్–1 పరీక్షలు జరుగుతాయి.

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు..

మార్చి 2న సెకండ్ లాంగ్వేజ్ పేపర్–2, 5న ఇంగ్లిష్ పేపర్–2, 7న గణితం పేపర్–2ఏ, బోటనీ పేపర్–2, సివిక్స్ పేపర్–2, 11న గణితం పేపర్–2బీ, జువాలజీ పేపర్–2, హిస్టరీ పేపర్–2 పరీక్షలు జరుగుతాయి. 13న ఫిజిక్స్ పేపర్–2, ఎకనామిక్స్ పేపర్–2, 15న కెమిస్ట్రి పేపర్–2, కామర్స్ పేపర్–2, సోషియాలజీ పేపర్–2, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్–2, 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్–2, లాజిక్ పేపర్–2, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు గణితం పేపర్–2, 20వ తేదీన చివరి పరీక్షగా మోడరన్ లాంగ్వేజ్ పేపర్–2, జాగ్రఫీ పేపర్–2 పరీక్షలు జరుగుతాయి.

నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు



ఈ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. 08812–230197కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోము. విద్యార్థులంతా అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడానికి ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచనలు చేశాం. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడానికి రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారం తీసుకుంటున్నాం.

– బీ ప్రభాకరరావు, జిల్లా వృత్తివిద్యా శాఖాధికారి, ఇంటర్ పరీక్షల కన్వీనర్

సెంట్రల్ ఫోర్స్ సిబ్బందికి సదుపాయాలు కల్పిస్తాం

ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి



భవనాలను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కేంద్ర బలగాలు జిల్లాకు రానున్న నేపథ్యంలో సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు టూటౌన్ ప్రాంతంలోని పలు భవనాలను ఎస్పీ మంగళవారం పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి రెండు నెలల కాలం జిల్లాలోనే కేంద్ర బలగాలు ఉండే అవకాశాలు ఉండడంతో వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎస్‌బీ సీఐ బీ.ఆదిప్రసాద్, ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ ఫలాలు అందరికీ చేరాలి

- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్
- ఏలూరు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీ కోటగిరి శ్రీధర్, కలెక్టర్ వెంకటేష్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు (మెట్రో): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు సమగ్రంగా చేరేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో ఏలూరు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం ఎంపీ కోటగిరి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి పథకాల అమలు తీరు, ప్రగతిని ఎంపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న ఆరోగ్య, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సమగ్రంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఎర్రకాలువ రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించి వాల్ రిపేర్‌లు, అదనపు గేట్ల అమరిక, జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టేలా జనవనరుల శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరులో వందేభారత్ రైలు హాల్ట్ విషయంపై ఇప్పటికే ఢిల్లీలోని రైల్వేబోర్డ్ చైర్మన్‌ను కోరడం జరిగిందని, దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పీఎం పసల బీమా యోజన–వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 2022 ఖరీఫ్‌లో 3,622 మంది రైతులకు రూ.2.41 కోట్లు, 2023 ఖరీఫ్‌లో 5,964 మంది రైతులకు రూ.10.65 కోట్లు అందించామన్నారు. జిల్లాలో 10,842 భూసార పరీక్షా కార్డులు పంపిణీ చేశారన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వలయోజన కింద వికసిత్ సంకల్ప భారత్ యాత్రలో 16 వేల గ్యాస్ కనెక్షన్లతోపాటు కొత్తగా 22 వేల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారన్నారు. జిల్లాలో ఇంతవరకు 3.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారన్నారు. జిల్లాలో ప్రతి నెలా 2,72,843 మందికి రూ.81.502 కోట్లు పెన్షన్లుగా అందిస్తున్నామన్నారు. జిల్లాలో వృత్తి నైపుణ్య కార్యక్రమాలు మరింత ముమ్మరం చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రధాన దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో జిల్లాలో మంజూరైన అభివృద్ధి పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఎంపీ కోరారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధి హామీలో పాత పనులన్నింటిని వేగవంతంగా పూర్తిచేయాలని, పెండింగ్ బిల్లులన్నీ రెండు రోజుల్లో అప్‌లోడ్ చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈని ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్ల పంపిణీ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ అంశాలపై అధికారుల నుంచి సమాచారం రాబట్టారు. జెడ్పీ సీఈఓ కేఎస్‌ఎస్ సుబ్బారావు, దిశ కమిటీ సభ్యులు ఉంగుటూరు ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి, చింతలపూడి ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు, కైకలూరు సర్పంచ్ వి.వసంతకుమారి పాల్గొన్నారు.

నేడు పెద అమిరంలో సీఎం పర్యటన



పెదఅమిరంలో హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం భీమవరం సమీపంలో ఉన్న పెదఅమిరంలో వైఎస్సార్ సీపీ నాయకుని ఇంట జరగనున్న వివాహ వేడుకకు హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం బయలుదేరి సాయంత్రం పెదఅమిరం హెలిప్యాడ్‌కు చేరుకుంటారని స్పష్టం చేశారు. అక్కడ నుంచి పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ కు చేరుకుని వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నరసింహా నాగేంద్రరావు (నాగబాబు) రాజరాజేశ్వరి దంపతుల కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించనున్నట్లు చెప్పారు. అనంతరం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి తిరుగు ప్రయాణం అవుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా పెదఅమిరం గ్రామంలో ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, గ్రామంలో ఉన్న కల్యాణ మండపాన్ని జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు.

నాణ్యమైన వస్తువులనే కొనుగోలు చేయాలి

బీఐఎస్ వర్క్‌షాప్‌లో ఏపీఎస్‌ఐ ఆర్‌డీ డైరెక్టర్ జె.మురళీ

ఏలూరు (మెట్రో): ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగించే వస్తువులను నాణ్యతా ప్రమాణాలను గుర్తించి కొనుగోలు చేయాలని ఏపీఎస్‌ఐ ఆర్‌డీ డైరెక్టర్ జె.మురళీ సూచించారు. స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) వర్క్‌షాప్ నిర్వహించారు. తొలుత జె.మురళీ, పంచాయతీరాజ్ సీనియర్ డైరెక్టర్ జె.వినోద్ వర్క్‌షాప్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బీఐఎస్ డైరెక్టర్ జె.వినోద్ మాట్లాడుతూ ప్రతి భారతీయ ఉత్పాదనకు ఐఎస్ఐ మార్క్ లభించేలా ఉత్పత్తిదారులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నాణ్యత, మన్నికపై బీఐఎస్ ఎలా నిర్ణయం తీసుకుంటుందనే అంశాలపై వివరించారు. జె.మురళీ మాట్లాడుతూ ఐఎస్ఐ హాల్‌మార్క్‌లేని వస్తువులను కొంటే నష్టమేనన్నారు. బీఐఎస్ సీనియర్ ఫ్యాకల్టీ కె.రాజశేఖర్ మాట్లాడుతూ మార్కెట్‌లో నాణ్యమైన వస్తువుల కొనుగోలు వల్ల ఆర్థిక భారం తగ్గడంతోపాటు వినియోగకాలం పెరుగుతుందన్నారు. 27 మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఏపీఎస్‌ఐ ఆర్‌డీ జడేడీ వై.దోసిరెడ్డి, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పీహెచ్‌సీల్లో పెరుగుతున్న ప్రసవాలు

- వైఎస్ జగన్ ప్రభుత్వంలో పీహెచ్‌సీల బలోపేతం
- అందుబాటులో వైద్యులు, సిబ్బంది, పరికరాలు
- ఉచిత కాన్పు, ఆసరా పథకం కింద రూ.5 వేల ఆర్థిక సాయం
- పశ్చిమగోదావరి జిల్లాలో గత ఏడాది నుంచి ఇప్పటివరకు 1,853 డెలివరీలు

భీమవరం (ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలను పూర్తిగా మార్చివేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర నుంచి జిల్లా ఆస్పత్రి వరకు సకల సౌకర్యాలతో అన్నిరకాలుగా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా వినియోగించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వైద్యులు ఉండడంతో కాన్పుల సంఖ్య పెరుగుతోంది. ఈ కేంద్రాల్లో నెలకు మూడు నుంచి ఐదు చొప్పున డెలివరీలు జరుగుతుండటమే కాక సహజ డెలివరీలు సైతం ఉంటున్నాయి. జిల్లాలో పీహెచ్‌సీలు 34 ఉండగా, అన్నిచోట్లా పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది, మందులు, సౌకర్యాలు అందుబాటులో ఉండటమే కాన్పుల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి.

ఇప్పటివరకు 2,098 డెలివరీలు : పశ్చిమగోదావరి జిల్లాలో 2022–2023 నుంచి 2023 –2024 వరకు ఈ జనవరి నాటికి జిల్లాలోని 34 పీహెచ్‌సీల్లో మొత్తం 2,098 డెలివరీలు జరిగాయి. ఇందులో గతేడాది 1,224 డెలివరీలు కాగా ఈ ఏడాది జనవరికి నాటికి 874 డెలివరీ చేయడం విశేషం.



కాళ్ల పీహెచ్‌సీలో శిశువును పరీక్షిస్తున్న వైద్యురాలు



మార్టేరు పీహెచ్‌సీలో తల్లీబిడ్డతో వైద్యులు, సిబ్బంది

పీహెచ్‌సీలో సిబ్బంది ఇలా..

ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, స్టాఫ్ నర్సులు–3, ఫార్మాసిస్టు–1, సూపర్‌వైజర్లు–2, ల్యాబ్ టెక్నీషియన్–1 చొప్పున అందుబాటులో ఉంటున్నారు.

పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది వివరాలు

మొత్తం పీహెచ్‌సీలు	34	సిబ్బంది	204
వైద్యులు	68	గర్భిణులు	19,366

ఉచిత వైద్యం, విశ్రాంతికి ఆర్థిక సాయం

పీహెచ్‌సీల్లో ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా డెలివరీ చేయడమే కాక బాలింత విశ్రాంతి కోసం ఆసరా పథకం ద్వారా పౌష్టికాహారం కోసం రూ.5 వేలను ప్రభుత్వం అందిస్తోంది. జిల్లాలో కాన్పు అయిన బాలింతలకు ఇప్పటివరకు ప్రభుత్వం ఆసరా కింద రూ.1.49 కోట్లు ఖర్చు చేసింది.

కాళ్ల పీహెచ్‌సీలో అత్యధికంగా 72 డెలివరీలు

జిల్లాలో గడిచిన 10 నెలల కాలంలో 72 డెలివరీలు చేసి అన్ని పీహెచ్‌సీల కంటే కాళ్ల పీహెచ్‌సీ ప్రథమస్థానంలో నిలిచింది. నెలకు సగటున ఏడు డెలివరీలు కాళ్ల పీహెచ్‌సీలో జరిగాయి. తర్వాత స్థానంలో 49 డెలివరీలతో పెనుమంట్ర పీహెచ్‌సీ నిలిచింది.

కాన్పుల సంఖ్య పెంచేలా చర్యలు



జిల్లాలోని పీహెచ్‌సీల్లో డెలివరీలు మరింత ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. నెలకి 5 నుంచి 10 వరకు డెలివరీలు జరిగేలా వైద్యులు, సిబ్బంది, ఆశలు, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్నాం. పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత లేదు. సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యశ్రీలో ఉచితంగా డెలివరీ చేయడంతో పాటు బాలింతకు పౌష్టికాహారం కోసం ఆసరా పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామానికి వచ్చే వైద్యులకు గర్భిణులు ఎప్పటికప్పుడు చూపించుకుని వైద్య సలహాలు, సూచనలు పొందాలి. సరైన ఆహారం, వ్యాయామం, సక్రమంగా మందులు తీసుకోవడం ద్వారా సాధారణ కాన్పు జరిగే అవకాశం ఉంటుంది.

– డి.మహేశ్వరరావు, డీఎం అండ్ హెచ్‌ఓ

గతంలో ప్రభుత్వంలో పీహెచ్‌సీల్లో డెలివరీలు జీరో

నాడు చంద్రబాబు పాలనలో జిల్లాలోని ఏ ఒక్క పీహెచ్‌సీలోనూ డెలివరీలు చేసే పరిస్థితి లేదు. అప్పట్లో గర్భిణులను డెలివరీల కోసం పీహెచ్‌సీలకు తీసుకువచ్చినా తగిన వైద్యం అందుబాటులో లేకపోవడమే కారణం. వైద్యులు, సిబ్బంది, పరికరాల కొరత కారణంగా డెలివరీలు చేసే పరిస్థితి లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి పేదలు వ్యయప్రయాసలకు గురయ్యేవారు. నేడు వైఎస్ జగన్ పాలనలో పీహెచ్‌సీలలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో డెలివరీల సంఖ్య పెరుగుతోంది.

క్లుప్తంగా

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్ పరిశీలన



అంతర్ రాష్ట్ర చెక్ పోస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ సురేష్‌కుమార్

కుక్కునూరు: మండలంలోని వేలేరు వద్ద ఉన్న అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను పోలవరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన పోలవరం డీఎస్పీగా బదిలీపై వచ్చారు. అలాగే కుక్కునూరులోని పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. డీఎస్పీని వైఎస్సార్ సీపీ నాయకులు సర్వ శ్రీహరి, ఆచంట మాధవరావులు చెక్ పోస్ట్ వద్ద కలిసి శాలువా కప్పి మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీ వెంట కుక్కునూరు సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

చికిత్స పొందుతూ రైల్వే వెండర్ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడిన వెండర్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు ఆర్‌ఆర్‌పేట డోకల వారి వీధికి చెందిన కొండపల్లి గాంధీ రైల్వే వెండర్‌గా పని చేస్తున్నాడు. అతను ఈ నెల 25న సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతడిని 108లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం గాంధీ మృతి చెందాడు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్ట్



డీఎస్పీ కార్యాలయంలో హత్య కేసుకు సంబంధించి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.సురేష్‌కుమార్ రెడ్డి, చిత్రంలో నిందితుడు (ముసుగులో ఉన్న వ్యక్తి)

పోలవరం రూరల్: కొత్తరామయ్యపేట పునరావాస కేంద్రంలో మేడూరి దుర్గ (38) అనే వివాహిత హత్య కేసులో నిందితుడిని మంగళవారం పోలవరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పోలవరం డీఎస్పీ కార్యాలయంలో హత్యకు సంబంధించిన కారణాలను విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.సురేష్‌కుమార్ రెడ్డి వివరించారు. కొత్తరామయ్యపేట పునరావాస కేంద్రం ప్రాంతానికి చెందిన మేడూరి దుర్గ (28)కు, సమీప బంధువు, వరుసకు మరిది అయిన మేడూరి ప్రసాద్ మధ్య గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. అయితే నెల రోజుల నుంచి దుర్గ వేరే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు అనుమానంతో ప్రసాద్ ఆమెతో గొడవ పడుతున్నాడు. ఆదివారం రాత్రి ప్రసాద్ దుర్గకు అనేక మార్లు ఫోన్ చేయగా, దుర్గ వేరే వారితో మాట్లాడుతుడంతో ఫోన్ కలవలేదు. ఫోన్ తీయడం లేదనే కోపంతో ప్రసాద్ దుర్గ ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. వెంటనే ప్రసాద్ తన వెంట తెచ్చుకున్న చాకుతో దుర్గ కంఠం కోసి, ఇంటి వెనుక వైపున మామిడి తోట నుంచి బయటకు వెళ్లిపోయాడు. అయితే గాయం తీవ్రంగా కావడంతో దుర్గ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రసాద్ హత్య చేసిన అనంతరం దుర్గ ఫోన్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. సమీపంలోని మొక్కజొన్న చేలో ప్రసాద్ బట్టలు, ఫోన్, చాకు దాచాడు. ఘటన జరిగిన వెంటనే పోలవరం సీఐ కె.మధు బాబు, ఎస్సై ఎస్ పవన్‌కుమార్, సిబ్బంది సంఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో పరిశీలించారు. మృతురాలి ఫోన్ కనబడకపోవడంతో అనేక కోణాల్లో దర్యాప్తు చేశారు. ఘటన జరిగిన రెండు రోజుల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించడంతో వాస్తవాలు తెలియజేశాయన్నారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేయడంపై జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితుడిని త్వరితగతిన పట్టుకున్నందుకు రివార్డులు కూడా ప్రకటిస్తామని డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ఆగిరిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఆర్‌ఐ కళాశాల విద్యార్థి మచ్చా జశ్వంత్(19) మృతి చెందాడు. మండలంలోని అడవినెక్కలం గ్రామానికి చెందిన జస్వంత్ ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాల నుంచి తన ద్విచక్ర వాహనంపై బయటకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

పెదవేగి: తనను ఎవ్వరూ సరిగ్గా పట్టించుకోవడం లేదని మనస్తాపానికి గురైన బాలిక బలవన్మరణానికి పాల్పడింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేగివాడ గ్రామానికి చెందిన మాదు రమ్యశ్రీ అదే గ్రామంలో పదో తరగతి చదువుతోంది. బాలిక చిన్నతనంలో తల్లి చనిపోయింది. తండ్రి శ్రీనివాసరావు మరో మహిళను వివాహం చేసుకున్నాడు. మద్యానికి బానిసైన తండ్రి తనను సరిగ్గా పట్టించుకోవడంలేదని సోమవారం ఉదయం పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలిక రమ్యశ్రీ (15) మంగళవారం సాయంత్రం మృతి చెందింది. బాలిక మృతి సమాచారం తెలిసిందని, పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని పెదవేగి ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సీఎం జగన్ ప్రభుత్వ సేవలు అభినందనీయం



బిషప్ జయరావుతో రాష్ట్ర ప్రభుత్వ క్రిస్టియన్ వ్యవహారాలు, మైనార్టీ సంక్షేమ శాఖల సలహాదారు డాక్టర్ బాలస్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని పేద మధ్యతరగతి వర్గాలకు విద్య, వైద్యం సహా పలు రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రోమన్ కతోలిక పీఠం ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావ్ పొలిమేర తెలిపారు. స్థానిక విద్యానగర్ లోని బిషప్ హౌస్‌లో మంగళవారం ఉదయం బిషప్ జయరావును రాష్ట్ర ప్రభుత్వ క్రిస్టియన్ వ్యవహారాలు, మైనార్టీ సంక్షేమ శాఖల సలహాదారు డా. బాలస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖ అగ్ర పీఠాధిపతిగా అదనపు బాధ్యతలు స్వీకరించనున్న ఏలూరు బిషప్ జయరావుకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ బాల, ఫాదర్ బాబు జార్జ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సొసైటీ అక్రమాలపై విచారణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ది ఏలూరు మున్సిపల్ ఎలిమెంటరీ అండ్ అప్పర్ ప్రైమరీ టీచర్ కో-ఆపరేటివ్ సొసైటీలో జరిగిన అక్రమ లావాదేవీలు, ఇతర ఆరోపణలపై డివిజినల్ కో-ఆపరేటివ్ అధికారి పి.త్రినాథ్ మంగళవారం విచారణకు ఆదేశించారు. సొసైటీలో జరిగిన అవినీతిపై అందిన ఫిర్యాదులను విచారించి ఐదు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఏలూరు డివిజన్ అసిస్టెంట్ కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ పి.ఝాన్సీ రాణిని విచారణాధికారిగా నియమించారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

ఏలూరు (టూటౌన్): తన సొంత అమ్మమ్మను హత్య చేసిన సంఘటనలో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏలూరు మొదటి అదనపు సెషన్స్ జడ్జి జి.రామ్‌గోపాల్ జీవిత ఖైదు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పును వెలువరించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2019, జూన్ 27న లింగపాలెం మండలం గోకవరం గ్రామానికి చెందిన తలారి మరియరాణి అలియాస్ మరియమ్మ తన అమ్మమ్మను ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఎవ్వరికీ అనుమానం రాకుండా హత్య చేసి బాత్ రూములో కాలుజారి పడిపోయి చనిపోయినట్లు అందరినీ నమ్మించింది. అనంతరం కులాచారం ప్రకారం శవాన్ని భూమిలో పాతి పెట్టి దహనసంస్కారాలు పూర్తి చేశారు. అయితే ముద్దాయి ప్రవర్తనపై అనుమానం కలిగిన అప్పటి చింతలపూడి సీఐ రాజేష్ ముద్దాయిని విచారించగా తన నేరం అంగీకరించడంతో దీనిపై తహసీల్దార్ సమక్షంలో శవాన్ని భూమి నుంచి వెలికి తీయించి వైద్యులతో శవపరీక్ష చేయించారు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐ రాజేష్ దర్యాప్తు పూర్తి చేసి ముద్దాయిపై చార్జ్‌షీట్‌ను కోర్టులో ఫైల్ చేశారు. దీనిపై వాదనలు పూర్తి కావడంతో ముద్దాయికు జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లక్ష్మనాయక్ తన వాదనలు వినిపించారు. కేసులో సాక్షులను ప్రవేశపెట్టడంలో ప్రస్తుత చింతలపూడి సీఐ సుధాకర్, ధర్మాజీగూడెం ఎస్సై చిన్నారావు, కోర్టు కానిస్టేబుల్ టి.రవికుమార్‌లు సహకరించారు.

సెంట్రల్ జోన్ క్రికెట్ విజేత సీఆర్ రెడ్డి జట్టు

కంచికచర్ల: మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు మంగళవారం జరిగాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిమ్మగడ్డ శౌరయ్య తెలిపారు. కళాశాల సీఈఓ డి.పాండురంగారావు టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఫైనల్ మ్యాచ్ వీఆర్ సిద్ధార్థ (కానూరు) సీఆర్ రెడ్డి(ఏలూరు) జట్టు తలపడ్డాయి. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ రెండు టీంల సభ్యులను పరిచయం చేసుకున్నారు. టాస్ గెలిచి వీఆర్ సిద్ధార్థ జట్టు ఫీల్డింగ్ ఎన్నుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన సీఆర్ రెడ్డి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 122 పరుగులు సాధించింది. బ్యాట్స్‌మన్ దుర్గాప్రసాద్ 34 బంతుల్లో 44 పరుగులు సాధించారు. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన వీఆర్ సిద్ధార్థ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 10 వికెట్లు నష్టపోయి 100 పరుగులు మాత్రమే చేసింది. సీఆర్ రెడ్డి జట్టు విజయం సాధించి సెంట్రల్ జోన్ క్రికెట్ కప్‌ను కైవసం చేసుకుంది.

వైద్యుడిపై యువతి ఫిర్యాదు

ఏలూరు టౌన్: పట్టణానికి చెందిన ఓ యువతి పెళ్లి చేసుకుంటానని వైద్యుడు నమ్మించి మోసగించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని ఒక ప్రాంతానికి చెందిన యువతి (28) తన తల్లి అనారోగ్యంతో ఉండడంతో ఏలూరు సమీపంలోని వంగాయిగూడెంలో ఉన్న గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడ డాక్టర్ కారంపూడి చంద్రశేఖర్ ఆమెకు వైద్యం చేశాడు. ఆ సమయంలో ఆ యువతితో పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. వివాహేతర సంబంధం కొనసాగించి ఆమెను గర్భవతిని చేశాడు. దీంతో ఏలూరు ఆర్‌ఆర్‌పేటలో ఉన్న జనని మెటర్నిటీ ఆసుపత్రికి తీసుకువెళ్లి ఆమెకు అబార్షన్ చేయించాడు. ఆ తరువాత పెళ్లి చేసుకోమంటే నిరాకరించాడు. దీంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు డాక్టర్ కారంపూడి చంద్రశేఖర్‌పై అత్యాచారం, చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చంద్రశేఖర్ నర్సరావుపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రస్తుతం అతను పరారీలో ఉండడంతో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.